# మార్చిపోతే సెప్టెంబరుందిలే

* * * రచన: తురగా హనుమంతరావు * * *

'పరీక్షలింక పదిహేను రోజులున్నయ్. పుస్తకాలువున్న వెన్నో, పోయినవెన్నో?—అందులో యే పుస్తకం ఎక్కడుందో? రైస్‌మిల్లు ఊకగుట్టల్లా పడున్నాయి పోర్షన్సు! అంతా అగమ్యగోచరం—' చదవకుండా యింతవరకూ టైం వేస్టు చేశామని మనస్సులో బాధ.

కాలేజీకి శెలవుపెట్టి ఒక్కొక్కటే బూజు దులిపి పుస్తకాలు వున్నవీ లేనివీ సరిచూసుకోవటంతో పగలంతా సరిపోయింది. కాలెండర్లో తిథీ వారం చూసుకుని ఆ రాత్రినుంచే స్టడీస్ ప్రారంభిద్దామని మధూ, సూరీ నిశ్చయించుకున్నారు.

రాత్రి ఎనిమిదిన్నరయ్యేసరికి రూంజేరారిద్దరూ. పుస్తకాలు ముందుంచి, కిళ్ళీలేసుకుని సిగరెట్ ముట్టించి—'ప్రార్థన పద్యం ఏం చదువుదామా?' అనుకునే సమయానికి స్టడీస్ ఎలాగున్నాయంటూ వాసు ప్రవేశించాడు.

'ఏమోరా! పోర్షన్సు చూస్తే మహా సముద్రాల్లా వున్నాయి—ఎప్పటికి తెవల్ను? 'పుస్తకం ముట్టలేదింతవరకూ. ఫిజిక్సు మహాగోలగావుందిరా! — అదో అఘాతం!' అన్నాడు మధు.

'దాన్ని తగలేసిరి! హైడ్రాస్టాటిక్సూ, ఎలక్ట్రిసిటీ దుంప తెంపేసున్నాయ్. రాత్రి చూశాను. ఒక్క అక్షరం లోపలికిపోతే ఒట్టు!'

'పుస్తకాలు చూస్తే యేడుపొస్తోంది. మన్ని చంపడానికాకపోతే యింతింతలావు బుక్సు రాయమని వీళ్ళనెవరేడిశారు?'

'ఒరే, నే చెబుతా విను! జనరల్ నాలెడ్జి వుండాలిగాని వెధవబుక్సు చదివి పేసయి చచ్చిన వాడెవడురా?'—సూరి అంటాడు నవ్వుతూ.

'బాగా చెప్పావు! మరి మనం చదవకుండా వుండడం దేనికి...?' మధు నవ్వుతూ తాళం వేశాడు సూరి మాటకి.

'నీ జనరల్ నాలెడ్జి అడుక్కుతిన, వెధవ ఖాతాఖానీ నువ్వూను ..అప్పుడే తొమ్మిదిన్నరయింది.' అన్నాడు సూరి.

'యివాళనుంచి రోజూ రానుట్రా? ఇంటిదగ్గర వెధవ చదువు సాగటంలేదు. ముగ్గురం కంబైన్డ్‌గా చదువుదాం' వాసు మధుని అడిగాడు.

'మన సూరీ ముహూర్తం నిశ్చయం చేసేశాడు— శ్రేయరు ప్రారంభిద్దామనుకునే సమయానికి సరిగ్గా నువ్వూ దిగావు. సరే, ఏం మొదలెడదాం?' అన్నాడు మధు.

'అబు తేరిశివా...' ముగ్గురూ కలిసి పాడి సిగరట్లు ముట్టించి పుస్తకాలు తెరిచారు.

'సూరీ! అన్నట్టు నా వెంకటాచారి (ఫిజిక్సు బెస్టు) నీ దగ్గరుందిరా?' వాసు అడిగాడు.

'లేదే! నేను మాణిక్యం ఫాలో అవుతున్నా. వెంకటాచారి ప్రాబ్లెమ్సు బాగా వర్కవుట్ చేశాడు...మరి మన మధు ఫాన్సీగావున్న బుక్కేగాని కొనడన్నది నీకు తెలుసుగదా!'

'ఎందుకురా, వెధవ వార్ క్వాలిటీ బుక్సు! బైండూలేదూ, ఏడుపూలేదు.. కాలేజీకి పట్టుకెడితే చూసినవాళ్ళకైనా బాగుండాలంటావా?' మధు నవ్వుతూ అంటాడు.

'బాగుందిరా, నాయనా! ఒకళ్ళను మించిన వాళ్ళొకళ్ళం! ఇప్పుడేట్లా? ఫిజిక్సు ప్రాబ్లెమ్సు ఒక్కొక్కదాంతో కవలపిల్లల్ని కన్నంత పనౌతోంది'

'లెక్చరర్నింటికెడితే చెబుతాడంటావా?' సూరి అన్నాడు.

'వాడి బొంద! క్లాసులో చెబుతూంటే అర్థమై చస్తూంది గనకనా, యింటికెడితే అర్థమయ్యేందుకు?'

'వాడసలే అనుమాన పీనుగ! అందులో మన్ని యింటిక్కూడా రానిస్తాడా? యింకా మన డిమాన్‌స్ట్రేటరు మెరుగు'

'వాడి మొహం! వాడికీ మనకీ తేడా యేమిటి? బ్రహ్మచారి ముండాకొడుకు! వాడింటిక్కూడా ఎందుకు మనం?'

'ఏడిశారు చదవండోయ్! పదిన్నరయింది'— అని సూరి హెచ్చరించాడు.

టీ తాగకుండా చదువు ప్రారంభిస్తే అది లోప

లికి పోయేమార్గం లేదనీ ముగ్గురూ ఫ్లాస్కులో టీ సేవించారు.

'టీ ఎలా వుందిరా?'

'రత్న భవన్ టీని తలదన్నేటట్లుంది.'

'రత్న భవన్ పేరు మోజేగాని ఉడిపీలో వున్నట్టు మరెక్కడా వుండదు'

'అఘోరించావు! అదీ చూశా. యింకా కాఫీకి చెప్పు! టీకి కృష్ణా రెస్టరెంటు ముందు చెప్పిన తరువాత మరేదేనా చెప్పు!'

'చాలించండోయ్! పిధవ కాంట్రవెర్సీ మీరూను. అప్పుడే పదకొండయింది' సూరి విసుక్కుంటాడు.

'రోజూ యిలాగే వుంటామా—ఇవాళ సరదా రేపు రమ్మంటే వస్తుందా? అరేయ్! ఆ చేతులో మేగజైన్ ఇలా పడేయ్!' అన్నాడు మధు.

అందులో ఫొటో తీసుకుని తను తెచ్చిన మేగజీన్ మధు కిస్తాడు వాసు. మధు ఫొటో చూసి—

'ఏమిటా ఫొటో?'

'ఎందుకా ఆదుర్దా...ఏమైతే నీకెందుకు?'

'లాక్కోవాలా, మంచితనంగానే చెప్పేదుందా?'

'రామకృష్ణ పరమహంసరా!'

వాసు మాటమీద మధుకు నమ్మకం చాల్లేదు. మధు వాసు చేతులో ఫొటో లాక్కుని 'దేవికా రాణి రామకృష్ణ పరమహంసెట్లా అయిందిరా?' అని సూరికి చూపిస్తాడు, చూశావురా దీనిమీదేం రాసివుందో?' అంటూ.

'విత్ లవ్ అండ్ కిసెస్—' అని చదివి 'అది వాడి రైటింగేరా, నాకు తెల్సు!' అన్నాడు సూరి.

'ఓరోయ్! ఏమో అనుకున్నాను. బుర్ర విశేషించి పని చెయ్యడం,లేదుగదా?' మధు నవ్వుతూ అన్నాడు.

'ఏడిశావులే! పత్రికల్లో వాళ్లూ వాళ్లూ రాసిన కథలు మారుపేరుతో నేను రాసినవేనని సొంతం చేసుగోవడ మనుకున్నావా?' ఆవేశంతో ఎత్తిపొడుస్తాడు వాసు.

'కథలకీ మనుషులికీ తేడావుంది!' నెమ్మదిగా వదులాడు మధు.

'ఊరుకోరా! డబ్బిచ్చి కొనుక్కున్న ఫొటో మీద ఆమాత్రం రాసుకునేందుకేనా హక్కులేదూ వాడికి? అయినా వాడి గొడవ మనకెందుకు? అప్పుడే పన్నెండయింది—పుస్తకం ముట్టలే దింతవరకూ' అన్నాడు సూరి.

'నా మూలాన్ని మీ చదువు నష్టమవుతూందనుకుంటా—పోతా నింటికి' అంటూ వాసు మెట్లు దిగాడు.

'కొత్తగా పెళ్లాం కాపరాని కొచ్చినవాడివి నీకు చదువెందుకురా!' అని మధు సూరీ నవ్వుకున్నారు. వాసు వెళ్ళిపోయాడు.

మధు పడక కుర్చీలోకి జరిగి, అప్పుడే పన్నెండున్నరయింది— యింకేనా తీవ్రంగా చదవాలని పట్టుదలతో పుస్తకం తెరిచాడు.

అక్షరాలు అనడంలేదు. కళ్ళు మూసుకుపోతున్నాయి. పెద్దవిచేసి చూసినకొద్దీ అక్షరాలు చక్కగా అలుక్కుపోతున్నాయి. విసుగొచ్చి దుప్పటీ కప్పుకొని పడుకున్నాడు—తెల్లారగట్ట లేపమని సూరితో చెప్పేడు—

లైటు వెలుగుతూనేవుంది. టేబిల్ మీద తల పెట్టి నిద్రపోతున్నాడు సూరి.

నిద్రలో చెయ్యితగిలి టేబిల్ మీద పుస్తకాలన్నీ కిందపడి పెద్ద చప్పుడైంది. సూరి ఖంగారుగా లేచి మధును లేపుతాడు—

'అబ్బ! పోయి పడుకో, చంపక!'

'ఏయ్! లేవరా తెల్లారగట్ట లేపమన్నావు.'

'యిలాటి వెన్నో అంటాం...పడుకుందూ, చంపక!'

'ఏడిశావ్! మాళ్ళొచ్చేస్తోంది.'

'అరేయ్! నీకాదూ...సెప్టెంబరుందిలే!'

'ఓరి నీ దీమాతగలెయ్య! నీకులేని భయం నాస్రా?'-అంటూ ముసుగుతన్నాడు సూరి.

ఆకర్షణీయమైన రచనలకు ఆనందవాణి